## క్లుప్తంగా

### ఆర్టీసీ సమ్మె పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**చుంచుపల్లి:** ఈనెల 7 నుంచి ఆర్టీసీలో తల పెట్టనున్న సమ్మె సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తగూడెం ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ నాయకులు సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ జేఏసీగా ఏర్పడి జరగబోవు సమ్మెలో యూనియన్లకు అతీతంగా అందరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కందుల భాస్కరరావు, జి.రమేష్ బాబు, కేవీ భద్రం, జేపీ కుమార్, ఆర్ఎన్ సింగ్, లింకన్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా న్యాయమూర్తులను కలిసిన జైలర్



జడ్జికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉపేందర్

**కొత్తగూడెంటౌన్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులోని జిల్లా జడ్జిలను శనివారం భద్రాచలం స్పెషల్ సబ్‌జైలు జైలర్ ఉపేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగూడెం కోర్టులో జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.సరిత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.కిరణ్‌కుమార్, రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.రవికుమార్‌లను జైలర్ ఉపేందర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు, డీకొండ రవి పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**పాల్వంచ:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. శనివారం మొర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు బీసీఎం రోడ్డులో ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. డ్రైవర్ తాటి బాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

### ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

**జూలూరుపాడు:** జనగణనతోపాటు కులగణన చేయాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం జూలూరుపాడులో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, భూక్యా రమేష్, ధరావత్ బాలకిషన్, నిమ్మటూరి రామారావు, సిరిపురపు గోపాల్‌రావు, నర్వనేని కృష్ణ, వందనపు సుబ్బు పాల్గొన్నారు.

### పలు గ్రామాల్లో పెసా గ్రామసభలు



జూలూరుపాడులో రైతులకు మ్యాప్ చూపుతున్న అధికారులు

**జూలూరుపాడు:** సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మించేందుకు భూసేకరణ కోసం శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా (పెసా) గ్రామసభలు నిర్వహించారు. జూలూరుపాడు, గుండెపుడి, కాకర్ల, పాపకొల్లు గ్రామాల్లో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారామ ప్రధాన కాలువ నుంచి చెరువులకు అనుసంధానం చేసేందుకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ తోపాటు, పిల్ల కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, మైనర్స్, పంట కెనాల్స్ కోసం భూ సేకరణ చేయనున్నామని, దీనికి రైతులందరూ సహకరించాలని కోరారు. సీతారామ ప్రధాన కాలువ పాత డిజైన్ ప్రకారమే నిర్మాణ పనులు కొనసాగుతాయని చెప్పారు. పలువురు రైతులు తమకు నష్టపరిహారం ఇవ్వలేదని ఎస్‌డీసీ కాశయ్య దృష్టికి తీసుకరాగా త్వరలో నష్టపరిహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, జేఈ మోహన్ వంశీ, ఎస్‌డీసీ కార్యాలయ డీటీ భరణిబాబు, ఆర్ఐ , సెక్రటరీలు పాల్గొన్నారు.

# అరచేతిలో ఆన్‌లైన్ మార్కెట్



- ఇంటర్‌నెట్‌లో కొనుగోళ్లకు అధిక ప్రాధాన్యత
- రోజుకు మూడు వేలకు పైగా వస్తువుల సరఫరా
- పండుగల వేళల్లో మరిన్ని

**చుంచుపల్లి:** విద్యానగర్‌కు చెందిన ప్రశాంత్ బీటెక్ పూర్తి చేసి ఇంట్లో పెద్ద దిక్కు ఎవరూ లేకపోవడంతో అతనే తన కుటుంబానికి కావాల్సిన అన్ని పనులను దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఏ వస్తువు కావాలన్నా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడుతున్నారు. చాలామంది ప్రముఖ సంస్థలకు చెందిన ఉత్పత్తులు ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం పల్లెల నుంచి పట్టణాల వరకు ఆన్‌లైన్ వ్యాపారాలు విపరీతంగా పెరిగాయి. మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లోని ప్రజలు సైతం ఆన్‌లైన్‌లో తమకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. రోజురోజుకూ సాంకేతికత వినియోగం విస్తృతమవుతోంది. గతంలో ఇంటి అవసరాలకు బయటకు వెళ్లే జనం, ప్రస్తుతం గడప కూడా దాటడం లేదు. మొబైల్ ఫోన్‌తో ఆన్‌లైన్‌లోనే అన్ని పనులను అనుకూలంగా మలుచుకుంటున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు ఏ వస్తువైనా ఇంటి వద్దకే తెప్పించుకునే వెసులుబాటు ఉండటంతో అన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ మార్కెట్‌కు ఆదరణ పెరుగుతోంది. నిత్యావసర సరకుల నుంచి ఇంటికి కావాల్సిన విలువైన వస్తువులు దొరకడంతో చాలామంది ఏ చిన్న వస్తువు కొనాలన్నా ఆన్‌లైన్ మార్కెట్ వైపే మొగ్గు చూపుతున్నారు. మార్కెట్ ధరల కంటే తక్కువకు లభిస్తుండటంతోనూ దీనికి డిమాండ్ ఎక్కువయింది. ఆర్థికంగా డబ్బులు ఆదా అవుతుండటంతో పాటు సమయం కలిసి రావడంతో వేగవంతమైన జీవనంలో ప్రజలకు ఉపయోగకరంగా మారిపోయింది. దీంతో పాటు ఆన్‌లైన్ మార్కెట్‌లో లభించే వస్తువులకు నిత్యం ఏదో ఒక ఆఫర్ వర్తింపజేస్తున్నారు. పండుగల సమయంతో పాటు వివిధ ప్రత్యేక రోజుల్లో మరింత ఎక్కువగా ధర తగ్గిస్తున్నారు. దీనికి తోడు క్రెడిట్ కార్డుల ద్వారా క్యాష్ బ్యాక్ ఆఫర్స్ సైతం కల్పిస్తున్నారు. నేరుగా మార్కెట్లో లభించే వస్తువు ధర కంటే ఆన్‌లైన్‌లో 10 నుంచి 20 శాతం వరకు తక్కువకు లభిస్తుండటంతో వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు.



సండే స్పెషల్

**నిత్యం మూడు వేల ఆర్డర్లు...**

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని 105 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల్లో కనీసం రోజుకు మూడు వేలకు పైగా వస్తువులు ఆన్‌లైన్ మార్కెట్ ద్వారా ఇళ్లకు చేరుతున్నాయి. ఆఫర్ల సమయంలో అయితే ఈ సంఖ్య రెండింతలవుతుంది. ప్రధాన పండుగల సందర్భాల్లో ఎలక్ట్రానిక్‌తో పాటు నిత్యావసరాలు, గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్లు ఇస్తుంటారు. ఈ సమయాల్లో 6–7 వేలకు పైగా వస్తువులు ఆర్డర్లు వస్తుంటాయని ఆయా సంస్థల పర్యవేక్షకులు చెప్పారు. ఉప్పు, పప్పుల నుంచి బెడ్స్, పరుపులు, ఫర్నిచర్, మొబైల్స్, దుస్తులు, టీవీలు, వంటపాత్రలు, అలంకరణ వస్తువులు, వివిధ రకాల తినుబండారాల వరకు ఆన్‌లైన్‌లో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

ప్రధానంగా 8 కంపెనీల సేవలు అందుతుండగా, 250 మంది డెలివరీ బాయ్‌లు ఉపాధి పొందుతున్నారు. రోజుకు ఒక్కో డెలివరీ బాయ్ వందల సంఖ్యలో వస్తువులను వినియోగదారులకు చేరవేస్తున్నారు. ఆన్‌లైన్ మార్కెట్ ప్రధాన పట్టణాలతో పాటు అన్ని పల్లెలకు విస్తరించింది. పట్టణాలకు వెళ్లి దుకాణాల్లో కొనుగోలు చేసే కంటే నేరుగా ఇంటి వద్దకు తీసుకొచ్చే ఈ మార్కెట్ పైనే పల్లెవాసులూ ఆధార పడటం క్రమంగా పెరుగుతోంది. ఈ వ్యవస్థ వల్ల వస్తువులు అందిన తర్వాతనే డబ్బులు చెల్లించవచ్చు. వస్తువు నాణ్యత లోపిస్తే నిర్ణీత సమయంలో తిరిగి పంపించవచ్చు.

ఆఫర్ల సమయంలో మార్కెట్ ధర కంటే 10 నుంచి 20 శాతం తక్కువకు లభిస్తుంటాయి. అన్నిరకాలుగా వస్తువును ఆన్‌లైన్‌లో పరిశీలించిన తర్వాతనే ఆర్డర్ పెట్టుకునే అవకాశం ఉంటుంది. క్రెడిట్ కార్డులుంటే కొనుగోలు చేసే వస్తువులపై భారీ తగ్గింపు కూడా ఉంటోంది.

**ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే కొంటా..**



ప్రస్తుతం ఆన్‌లైన్ ట్రెండ్ కొనసాగుతున్న నేపథ్యంలో నాకు అవసరమయ్యే వస్తువులను ఆన్‌లైన్‌లో సెలెక్ట్ చేసుకొని కొనుగోలు చేస్తుంటాను. అన్నిరకాల వస్తువులు తక్కువ ధరలోనే లభిస్తుంటాయి. అంతేకాకుండా పలు రకాలైన ఆఫర్లు కలిసొస్తుంటాయి కాబట్టి ఎక్కువగా ఆన్‌లైన్ ఆర్డర్‌కే ఆసక్తి చూపుతాను.

– ఎ.మనోజ్‌కుమార్, విద్యానగర్

**చిరు వ్యాపారులకు నష్టమే...**



చాలామంది తమకు కావాల్సిన వస్తువులను ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసుకుంటున్నారు. ఇది మండలాల నుంచి గ్రామాల్లోని ప్రజలకు సైతం పాకింది. దీంతో తమకు అవసరమయ్యే నిత్యావసర సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌తో మా వ్యాపారం నడవడం లేదు. దీంతో చిన్న, మధ్య తరహా దుకాణాల నిర్వహణ భారంగా ఉంది.

– అయితా రంజిత్, ఫ్యాన్సీ షాపు యజమాని

## యువ వికాసం రుణాలకు ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూకు హాజరైన నిరుద్యోగులు

**ఇల్లెందు:** రాజీవ్ యువ వికాసం పథకంలో యువతీ యువకులకు రుణ సదుపాయం కల్పించేందుకు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. శనివారం పట్టణంలోని మెప్మా భవన్‌లో జరిగిన ఇంటర్వ్యూకు ఎస్సీ వర్గం యువతీ యువకులు 384 మంది హాజరయ్యారు. 450 మంది దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకర్ల సమక్షంలో జరిగిన ఈ ఎంపికలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ, ఆయా బ్యాంక్ మేనేజర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అర్హులందరికీ రుణాలు లభిస్తాయని, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉంటుందని కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. అపోహలకు తావు లేదన్నారు. దళారులను నమ్మి మోస పోవద్దన్నారు. ఎంపిక చేసుకున్న రుణం పొంది ప్రాజెక్టు నెలకొల్పాలని, రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## న్యాయవాది గురుప్రసాద్‌కు నివాళి



జిల్లా కోర్టులో సంతాపం ప్రకటిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

**కొత్తగూడెంటౌన్:** సీనియర్ న్యాయవాది ఆళ్ల గురుప్రసాద్ మరణం తీరని లోటని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. కొత్తగూడెం జిల్లా కోర్టులో శనివారం జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి పాటిల్ వసంత్ మాట్లాడుతూ.. గతంలో కొత్తగూడెం కోర్టులో పనిచేసిన ఆయన విశాఖపట్టణంలో శనివారం మృతి చెందారని పేర్కొన్నారు. గురుప్రసాద్ కొత్తగూడెం న్యాయసేవలలో, న్యాయ వృత్తిలో తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.సరిత, కె.కిరణ్‌కుమార్, సుచరిత, కె.సాయిశ్రీ, బి.రవికుమార్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు, బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు పలివెల గణేష్‌బాబు, వై.ఉదయ్‌భాస్కర్, వై.బాబూరావు, కె.పుల్లయ్య, పోసాని రాధాకృష్ణమూర్తి, రమేష్‌కుమార్ మక్కడ్, జె.శివరాంప్రసాద్, చంద్ర నరేంద్ర, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జే.గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.మాధవరావు, మహిళా ప్రతినిధి అడపాల పార్వతి, కార్యదర్శి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాలక్ష్మి



జూలూరుపాడు: మాట్లాడుతున్న తహసీల్దార్ స్వాతిబిందు

**జూలూరుపాడు:** పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. పశువులు అక్రమ రవాణ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల విక్రయాలపై గ్రామ పంచాయతీ సెక్రటరీలు దృష్టి పెట్టాలని చెప్పారు. పశుపోషకులు తమ పశువులను ఏ కారణం చేత అమ్ముతున్నారు? కొనుగోలు చేసేవారు పాల ఉత్పత్తి కోసమా? వ్యవసాయం కోసమా? అనే వివరాలు తెలుసుకోవాలని సూచించారు. పశువులు, మూగజీవాలు సంతతి అంతరించకుండా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రైతులు, పశుపోషకులు తమ పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్స్ అంటించే విధంగా చూడాలని, దీంతో ప్రమాదాలను నివారించవచ్చన్నారు. పశువులను రహదారులపై సంచరించకుండా రైతులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ బాదావత్ రవి, పశువైద్యాధికారి సాయిరాం సందీప్, ఎంపీఓ తులసీరామ్, ఆర్ఐ ఆదినారాయణ, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

**పాల్వంచరూరల్:** పశువులను ఒకప్రదేశం నుంచి మరో ప్రదేశానికి రవాణా చేయాలంటే ముందుగా పశువైద్యాధికారి జారీ చేసిన ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గోవధ నిషేధంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గో హత్య నిషేధం, జంతు సంరక్షణ చట్టం 1977 ప్రకారం ఆవులు, లేగ దూడలు, గేదెలను వధించడాన్ని అరికట్టాలనే అంశంపై చర్చించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు గ్రామ, మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వివేక్, ఎస్ఐ నరేష్, వెటర్నరీ డాక్టర్ జి.రమేష్, ఎంపీఓ బి.నారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

**టేకులపల్లి:** కోయగూడెం గ్రామంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మూడు రోజులు నిర్వహించనున్న ఆ కార్యక్రమాల్లో బొడ్రాయి, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ, పోతురాజు, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠకు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివార విగ్రహాల ప్రతిష్ఠ జరగనుంది. ఎమ్మెల్యే కోరం కనకయ్య లక్ష్మి, కోరం సురేందర్, ఉమ దంపతులలతో పాటు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, ఇల్లెందు, టేకులపల్లి సీఐలు బత్తుల సత్యనారాయణ, టి.సురేష్, ఎస్ఐ రాజేందర్ పాల్గొని పూజలు చేశారు.

**నేడు మంత్రి పొంగులేటి రాక..**

కోయగూడెం గ్రామంలో బొడ్రాయి, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ, పోతురాజు, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతోంది. ఆదివారం ముగింపు కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నట్లు కోరం సురేందర్ శనివారం తెలిపారు.

## హీరో విజయ్‌పై చర్యలు తీసుకోవాలి

**జూలూరుపాడు:** హీరో సూర్య నటించిన రెట్రో సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో గిరిజనుల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన హీరో విజయ్ దేవరకొండపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు బానోత్ శాంతిలాల్, భూక్యా దేవీలాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడులో నాయకులు మాట్లాడుతూ గిరిజనుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేసిన సినీ హీరో విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలన్నారు. సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులిస్తేనే ఇందిరమ్మ ఇంటికి అర్హులా..?



కోక్యాతండా గ్రామంలో పరిశీలిస్తున్న అధికారులు

**టేకులపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. టేకులపల్లి మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రజాపాలన కార్యక్రమంలో ఇంటి కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసింది. టేకులపల్లి మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన కోయగూడెం పంచాయతీకి 230 ఇళ్లు మంజూరు కాగా మిగిలిన పంచాయతీలు అన్నింటికీ కలిపి 673 ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో పంచాయతీకి సుమారు 10 నుంచి 20 లోపు ఇళ్లు వచ్చే అవకాశం ఉంది. అయితే పంచాయితీల్లో దరఖాస్తులు వందల సంఖ్యలో ఉండగా.. ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హుల జాబితాను సిద్ధం చేసి తనిఖీ అధికారులకు అందజేశారు. దీని ప్రయారం గ్రామాల్లో అధికారులు తనిఖీ చేపడుతున్నారు. ఈ క్రమంలో అర్హుల ఎంపిక, తనిఖీల విషయంలో విమర్శలు తలెత్తుతున్నాయి. డబ్బులిస్తేనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారని, నిరుపేదలకు ఇవ్వడం పలువురు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా తడికలపూడి పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, పాత తడికలపూడి, కోక్యా తండా గ్రామాల్లో రెండురోజులుగా నిర్వహించిన ఇందిరమ్మ తనిఖీలు గందరగోళంగా మారాయి. అధికారులు, కొందరు నాయకుల తీరును బాధిత లబ్ధిదారులు తప్పు పడుతున్నారు. మొదట ఇల్లు వచ్చిందని ప్రకటించి తీరా తుది జాబితాలో పేర్లు లేకుండా చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులిస్తేనే ఇల్లు ఇస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ పంచాయతీలో ఏ గ్రామంలో చూసినా దీని గురించే చర్చించుకుంటున్నారు. మండలంలో మిగిలిన కొన్ని పంచాయతీల్లోనూ ఇదే తీరు కొనసాగుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు, ఇల్లెందు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



సూపర్‌బజార్(కొత్తగూడెం): పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు



జూలూరుపాడులో ఏఐవైఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక శేషగిరిభవన్‌లో శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా పతాకావిష్కరణ చేసిన అనంతరం మాట్లాడారు. ఏఐవైఎఫ్ పోరాట చరిత్రను సాధించిన విజయాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌కే రసూల్, పి.రాజు, ప్రసాద్, గణేష్, హరినాథ్, ఇమ్రాన్, సమీర్, హరి తదితరులు పాల్గొన్నారు.

**జూలూరుపాడు:** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువతకు విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి హక్కులను కల్పించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలు, దేశభక్తి, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలు, నైతిక విలువలు, మానవత్వాన్ని పెంపొందించడంలో ఏఐవైఎఫ్ నిరంతరాయంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పసుపులేటి పవన్, మనోజ్, నజీర్, సురేష్, వెంకటేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ నిధులొస్తేనే అభివృద్ధికి మోక్షం..

**అమాత్యుల చుట్టూ ప్రదక్షిణలు** చేసైనా మంజూరు చేయించుకున్న నిధులతో పనులు చకచకా పూర్తి చేసి.. ఇది తమ ఘనతేనంటూ ప్రచారం చేసుకొని ఆయా ప్రాంతాలలో పట్టు పెంచుకోవడం రాజకీయ పక్షాల అమ్ముల పొదిలో ప్రధాన అస్త్రం. తప్పిదం ఎక్కడ జరుగుతుందో కానీ సులువుగా రాచమార్గంలో మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవడంలో స్థానిక నేతలు విఫలమయ్యారు. ఫలితంగా మంజూరైన వాటిలో కొన్ని నిధులు రద్దవగా.. మరికొన్ని దారిమళ్లాయి. ఇంకొన్ని వివాదాల కారణంగా నిలిచిపోయాయి. ఇదీ ఇల్లెందు మండలంలో తాజాగా చోటుచేసుకున్న అభివృద్ధి పనుల దుస్థితి.

- పనులు చేయక రద్దయిన ఎన్ఆర్ఈజీఎస్ పద్దు
- గొడవ కారణంగా దారి మళ్లిన డీఎంఎఫ్‌టీ నిధులు
- పంచాయతీ భవన నిర్మాణంలోనూ కొనసాగుతున్న వివాదం



నిధులు మంజూరైనా సుభాష్‌నగర్‌లో సీసీకి నోచుకోని రహదారి

**ఇల్లెందురూరల్:** 2023–24లో డీఎంఎఫ్‌టీ పథకంలో భాగంగా ఇల్లెందు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం అధిక మొత్తంలో నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలు సమీపించడంతో ఆయా పనులను అప్పటి ప్రభుత్వం తమ పార్టీకి చెందిన కార్యకర్తలకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టింది. ఇందులో భాగంగా 2024 ఆగస్టులో సుభాష్‌నగర్ గ్రామపంచాయతీకి రూ.25 లక్షల వ్యయంతో ఐదు సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఇందులో మూడు రోడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయగా రెండు రోడ్లు వాయిదా పడ్డాయి. ఆ తరువాత ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారిపోవడం చకచకా జరిగిపోయాయి. అయితే పెండింగ్‌లో ఉన్న పనుల నిర్మాణంపై రాజకీయ రగడ నెలకొనడంతో నేటికీ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి. ఇదిలా ఉండగా సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో పనులు చేయకుండా ఉండిపోయిన రూ.10 లక్షల నిధులను సద్వినియోగం చేసుకుంటామంటూ టేకులపల్లి మండలానికి చెందిన నేతలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వద్ద అర్జీ పెట్టుకున్నారు. ఆయన ఇటీవల నిధుల మళ్లింపునకు ఆమోదం తెలుపడంతో కలెక్టర్ సదరు రూ.పది లక్షలను టేకులపల్లి మండలానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**పనులు చేయక రద్దయిన నిధులు...**

మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆయా నిధులను మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు ప్రాధాన్యా బట్టి కేటాయిచారు. కానీ సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో రూ.20 లక్షలు, రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలో రూ.10 లక్షల నిధులను సద్వినియోగం చేసుకోవడంలో నేతలు విఫలమయ్యారు. గడువులోపు పనులు పూర్తి చేయకపోవడంతో ఆయా నిధులు రద్దయ్యాయి. అయితే 2025–26 ఆర్థిక సంవత్సరానికి మంజూరయ్యే నిధులలో రూ.30 లక్షలు తగ్గించి 2024–25లో రద్దయిన నిధులను సర్దుబాటు చేస్తారు. అంటే తాజాగా పనులు చేయకుండా రద్దయిన రూ.30 లక్షల నిధులను వచ్చే ఆర్థిక సంవత్సరం కోటాలో మండలం నష్టపోతుంది.

**స్థల వివాదంతో నిలిచిన నిర్మాణం...**

మండలంలోని 29 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 21 గ్రామపంచాయతీల కార్యాలయ భవన నిర్మాణాలకు ఐటీడీఏ, ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా నిధులు మంజూరయ్యాయి. ఇదే క్రమంలో సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో పంచాయతీ భవనం నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారు. అధికారుల సమక్షంలోనే శంకుస్థాపన పూర్తి చేసి అట్టహాసంగా పనులు ప్రారంభించారు. పనులు కూడా లెంటల్ లెవల్ చేరుకున్న తరుణంలో స్థల వివాదం తెరమీదకు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఇది జరిగి ఏడాది పూర్తి కావస్తున్నా అటు పంచాయతీ అధికారులు, ఇటు స్థలం కేటాయించిన రెవెన్యూ అధికారులు కానీ సుభాష్‌నగర్‌లో చోటుచేసుకున్న స్థల వివాదంలో తలదూర్చకపోవడమే మేలన్నట్లుగా ఉండిపోయారు. ఇదిలా ఉండగా ఇతర గ్రామపంచాయతీలలో కార్యాలయ భవన నిర్మాణాలు స్థానిక నేతల కృషితో వేగవంతంగా కొనసాగుతుండగా.. సుభాష్‌నగర్‌లో ఎవరూ పట్టించుకోకపోవడం గ్రామపంచాయతీ భవనం నిర్మాణ పురోగతిపై ప్రభావం చూపుతోంది.



నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణం